సాక్షి
నిర్మల్
గురువారం : 22 : మే : 2025



పుష్కరఘాట్లపై మట్టి కుప్పలు

బాసరలోని గోదావరి పుష్కరఘాట్లు అపరిశుభ్రంగా మారాయి. వాటిపైనున్న మట్టికుప్పలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



రాజీవ్‌గాంధీకి నివాళి 9లో▸

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన వరి ధాన్యం
- కొన్నిచోట్ల కొట్టుకుపోయిన వడ్లు
- నేలవాలిన వరి, నువ్వు చేన్లు
- అవస్థలకు గురైన అన్నదాతలు



ఖానాపూర్ మార్కెట్ యార్డులో నీటిలో నుంచి ధాన్యాన్ని ఎత్తుకుంటున్న మహిళ

లోకేశ్వరం/లక్ష్మణచాంద/కుంటాల/భైంసాటౌన్/భైంసారూరల్/మామడ/ఖానాపూర్/పెంబి/దస్తురాబాద్/తానూరు: జిల్లాలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం, సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షం రైతుల వరి ధాన్యాన్ని తడిపేసింది. రైతులు రాత్రిపూట ధాన్యం తడవకుండా ఉండేందుకు నానా తిప్పలు పడ్డారు. చాలా కొనుగోలు కేంద్రాల్లో తూకంలో జాప్యం కారణంగానే ధాన్యం తడిసినట్లు రైతులు ఆరోపించడం గమనార్హం. లోకేశ్వరం మండలం జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, పిప్రి, వట్టోలి, గడ్‌చాంద, రాజూర, అర్లి, గొడిసెరా, నగర్ తదితర గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి వరి, నువ్వు చేన్లు నేలవాలాయి. కల్లాల్లో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. లక్ష్మణచాంద మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి వరి, నువ్వు ధాన్యం తడిసింది. కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. లక్ష్మణచాంద మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. కుంటాల మండలంలోనూ బుధవారం వేకువజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. అప్రమత్తమైన రైతులు కల్లాల వద్దకు పరుగులు పెట్టి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పారు. బుధవారం ఉదయం కురిసిన వర్షానికి భైంసా మండలంలోని దేగాం, ఇలేగాం, కామోల్, కుంసర, వానల్‌పాడ్, మహాగాం తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులు అవస్థలు పడ్డారు. వాలేగాం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయింది. భైంసా పట్టణంలోనూ భారీ వర్షం కురిసింది. మామడ మండలం పొన్కల్, మామడ, కొరిటికల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న, రైతులు సంచుల్లో నింపుకొన్న ధాన్యం తడిసింది. తానూరు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఖానాపూర్ మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల ఆవరణలో రైతులు ఆరబెట్టిన ధాన్యం వరదనీటికి కొట్టుకుపోయింది. ఖానాపూర్ పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురియగా ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. శివాజీనగర్, బస్టాండ్ ఏరియాలో వరదనీరు డ్రైనేజీల నుంచి రోడ్లపై వరదలా పారింది. దీంతో పట్టణవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్, తాంశా, కొట్ల(కే) చించోలి, ముజ్గిగాలో భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. పెంబి మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి, నువ్వు పంటలు, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కుప్పలు తడిసి పోయాయి. కొన్నిచోట్ల వడ్లు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మండలంలోని మందపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా ఎస్సై హన్మాండ్లు రైతులతో కలిసి కుప్పలపై టార్పాలిన్లు కప్పి సాయపడ్డారు. దస్తురాబాద్ మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోగా సంబంధిత సిబ్బంది పునరుద్ధరించారు. మొత్తంగా అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది.



నిర్మల్ రూరల్ మండలం కోట్ల(కే) ప్రధాన రహదారిపై వర్షానికి తడిసిన వడ్ల కుప్పలు



లోకేశ్వరం: రాజూరలో తడిసిన వరి ధాన్యం సంచులు చూపిస్తున్న రైతులు



మామడ: పొన్కల్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం సంచులు



ఖానాపూర్: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పల కింద నిలిచిన నీటిని చూపిస్తున్న రైతు



కుంటాల: మండల కేంద్రంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ పైనుంచి నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు



పెంబి: ధాన్యం తడవకుండా కుప్పలపై టార్పాలిన్లు కప్పుకొంటున్న రైతులకు సాయపడుతున్న ఎస్సై హన్మాండ్లు



లక్ష్మణచాంద: రాచాపూర్ గ్రామ సమీపంలో వర్షానికి తడిసిన రైతులు ఆరబోసిన వరి ధాన్యం

న్యూస్‌రీల్

శిక్షణ కేంద్రాల తనిఖీ



మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ కేంద్రాలను బుధవారం జిల్లా విద్యాధికారి రామారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక తరగతులకు బోధించే ఉపాధ్యాయులు తమ బోధన తీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. శిక్షణ కేంద్రాలను రాష్ట్ర బాధ్యుడు రామకృష్ణ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో వెంకటేశ్వర్, కోర్సు బాధ్యుడు గజ్జరామ్, డీఆర్పీలు పాల్గొన్నారు.

మొదటి స్థానంలో నిలవాలి



ఉద్యోగులకు సూచనలిస్తున్న ప్రణీత్, శ్రీహర్ష

నిర్మల్‌టౌన్: ఇప్పటివరకు ఆదిలాబాద్ రీజియన్‌లో నిర్మల్ డిపో మొదటి స్థానంలో ఉందని, భవిష్యత్‌లో రాష్ట్రంలోనూ మొదటి స్థానంలో నిలువాలని ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ రీజినల్ మేనేజర్ ప్రణీత్ ఆకాంక్షించారు. బుధవారం నిర్మల్ ఆర్టీసీ డిపోను డిప్యూటీ ఆర్‌ఎం శ్రీహర్షతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదాయ, వ్యయాల గురించి ఆరా తీశారు. కండక్టర్లు, డ్రైవర్ల పనితీరును పరిశీలించారు. పలు ఫైళ్లను తనిఖీ చేశారు. వివాహాలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను సమయపాలనతో నడపాలని సూచించారు. డిపో మేనేజర్ పండరి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరగా కొనుగోలు చేయాలి

కుంటాల: అకాల వర్షాలకు ధాన్యం తడిసే అవకాశముందని, త్వరగా కొనుగోలు చేయాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డిని రైతులు కోరారు. కొనుగోలు కేంద్రంలోని సిబ్బంది రాత్రి వేళ తమకు తెలియకుండా ఇతర ప్రాంతాల రైతుల ధాన్యం తూకం వేస్తున్నారని ఆరోపించారు. దీంతో వెంటనే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

పోలీస్ శాఖలో బదిలీలు

నిర్మల్‌టౌన్: నిర్మల్, భైంసా సబ్ డివిజినల్ పరిధిలోని సివిల్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద బదిలీలు చేపట్టినట్లు ఎస్పీ జానకీ షర్మిల ఓ ప్రకటనలో తెలిపారు. 66 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు ఏఎస్సైలను బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.


'ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు'



తడిసిన ధాన్యం చూపుతున్న నాయకులు

ఖానాపూర్: వరి ధాన్యం కొనుగోళ్లలో సహకార సంఘం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీపీ మోహిద్ ఆరోపించారు. బుధవారం మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామస్తులతో కలిసి సందర్శించారు. నిర్వాహకులు సకాలంలో ధాన్యం తూకం వేయకపోవడం, గన్నీ సంచులు, హమాలీలు, లారీల కొరత కారణంగా ఉదయం, సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. సకాలంలో రైతుల ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు.

23న తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మన దేశ సైనికులకు సంఘీభావం ప్రకటిస్తూ ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తిరంగా ర్యాలీ జిల్లా కన్వీనర్ మేడిసమ్మె రాజు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ర్యాలీ అంబేడ్కర్ చౌక్ నుంచి వివేక్ చౌక్‌కు చేరుకుంటుందని తెలిపారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాలవారు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పకడ్బందీగా 'భూభారతి' అమలు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- కుంటాలలో అధికారులతో సమీక్ష
- ముథోల్‌లో వ్యవసాయ క్షేత్రం పరిశీలన



కుంటాల: అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కుంటాల: భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ రైతుకు నోటీసు జారీ చేసి ఇరుపక్షాల సమక్షంలో పారదర్శకంగా విచారణ చేపట్టి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు కమల్‌సింగ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, డీటీ నరేశ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

'మహా'జొన్నలు కొనుగోలు చేయొద్దు

మహారాష్ట్ర నుంచి వచ్చే జొన్నలను కొనుగోలు చేసి ఇక్కడి రైతులకు అన్యాయం చేయొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. త్వరలో కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీసీవో పల్లె పాపారావు, తహసీల్దార్ కమల్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సీఏవో నాగభూషణం తదితరులున్నారు.

పంట మార్పిడితో లాభాలు

ముథోల్: మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని పంట మార్పిడి విధానం పాటించి అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మండలంలోని తరోడ గ్రామంలో రైతు హర్షియాబేగం సాగుచేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఉపాధిహామీతోపాటు ఐకేపీ నుంచి తీసుకున్న రుణంతో వివిధ పంటలు, కూరగాయలు, పశువులు, చేపల పెంపకం చేపట్టడాన్ని అభినందించారు. కంపోస్టు ఎరువులను ఎక్కువగా వాడి తక్కువ పెట్టుబడితో ఎక్కువగా లాభాలు పొందాలని సూచించారు. చేపల పెంపకంతో ఉపాధి పొందడంతోపాటు భూగర్భ జలాలను పెంచవచ్చని పేర్కొన్నారు. రెండు గుంటల భూమిలో చేపల పెంపకంతో ఏడాదికి రూ.4లక్షల ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. సమీకృత క్షేత్రంపై రైతులకు అవగాహన కల్పించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీష, ఏపీఎం గురుచరణ్, ఉపాధిహామీ సిబ్బంది యోగేశ్, భాస్కర్‌రెడ్డి, సుశీల్, పోశెట్టి, సూర్యకాంత్, వందేమాతరం, వీవోఏ ఓమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా ఏరియాస్పత్రికి కార్పొరేట్ కళ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న సురేశ్, అధికారులు

భైంసాటౌన్: భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రికి కార్పొరేట్ కళ సంతరించుకోనుంది. ఈ మేరకు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ బ్రాండింగ్ పథకానికి ఈ ఆస్పత్రిని ఎంపిక చేసింది. తెలంగాణ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రిలో మౌలిక వసతులు, సుందరీకరణ, ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సురేశ్, టీఎస్‌ఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏరియాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, ఆర్‌ఎంవో కైలాస్‌పతితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భైంసా ఏరియాస్పత్రిలో అవసరమైన మౌలిక వసతులు, సుందరీకరణ, పార్కింగ్, ఓపీ, ఐపీ బ్యూటిఫికేషన్, ఫైర్‌సేఫ్టీ, గార్డెనింగ్ తదితర పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూపొందించిన నివేదికను టీవీవీపీ కమిషనర్‌కు అందిస్తామన్నారు. ఆపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపడతామని చెప్పారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోగల ఖానాపూర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా సహకార అధికారి కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజమల్లు పరిశీలించారు. రైతులు ఆందోళన చెందొద్దని, ధాన్యాన్ని సకాలంలో తూకం వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షంతో తడిసిన ధాన్యాన్ని రైతులు అధికారికి చూపించారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

'ఉపాధి' కొలనులు!



మామడ మండలంలో కొలను నిర్మాణానికి కొలతలు తీస్తున్న టెక్నికల్ అసిస్టెంట్

- ఫిష్‌పాండ్స్ నిర్మాణానికి చర్యలు
- కూలీలు, మత్స్యకారులకు మేలు
- జిల్లాకు 265యూనిట్లు మంజూరు
- 118 చోట్ల తవ్వకం పనులు ప్రారంభం

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి, ఆర్థిక సాధికారతను పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపల కొలనుల నిర్మాణానికి సంకల్పించింది. చెరువులు, కుంటల శిఖం భూముల పరిరక్షణతో పాటు కూలీలకు ఉపాధి, మత్స్యకారులకు భరోసా కల్పించాలని భావిస్తోంది. చేపల కొలనుల ద్వారా భూగర్భజలాలూ పెరగనుండగా జిల్లాలో రెవెన్యూ, మత్స్యశాఖల అనుమతులతో వీటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అనువైన చెరువులు, కుంటల సమీప శిఖం భూములు, నీటిని తరలించేందుకు వీలున్న ప్రాంతాలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది 265 చెరువుల్లో కొలనుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసి ఇప్పటికే 118 చోట్ల పనులు ప్రారంభించింది.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికే..

చేపల కొలనులు నిర్మించడం ద్వారా చెరువుల్లో నీరు నిల్వ ఉండడంతో భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో ఈ నీరు పంటల సాగుకు వాడుకోవచ్చు. కొలనుల తవ్వకంలో భాగంగా వచ్చే మట్టి సారవంతమైనది కావడంతో సాగు భూముల్లో వేసుకోవచ్చు. చేపల పెంపకంతో మత్స్యకారులకు అదనపు ఆదాయం కూడా వస్తుంది. చెరువులు, కుంటల శిఖం భూముల్లో వీటిని ఏర్పాటు చేయనుండగా ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా నిలువరించే అవకాశముంది.

కొలనుల నిర్మాణం ఇలా..

చెరువులకు 100 నుంచి 300 మీటర్ల దూరంలో 25 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతులో కొలనులు తవ్వనున్నారు. ఒక యూనిట్‌కు నాలుగు కొలనుల చొప్పున.. ఒక్కోదాని నిర్మాణానికి 2,600 పని దినాలను కూలీలకు కల్పించనున్నారు. ఒక్కో కొలనుకు సుమారు రూ.8.5 లక్షల వరకు ఖర్చవుతుందని ఉపాధిహామీ అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో కొలనులు తవ్వేందుకు కూలీలను అధికసంఖ్యలో తరలిస్తున్నారు. చేపల కొలనుల నిర్మాణంతో కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. వేసవి పూర్తయ్యేలోపు అన్ని గ్రామాల్లో చేపల కొలనుల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇవి పూర్తయితే వర్షాలు కురిసిన సమయంలో నీళ్లు నిల్వ ఉండటంతో చేపలు పెంచుకునేందుకు అవకాశముంటుంది. జిల్లాలో 1.77 లక్షల ఉపాధిహామీ జాబ్‌కార్డులుండగా 3.38 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో 2.28 లక్షలమంది పనులకు వెళ్తున్నారు.

చేకూరే ప్రయోజనాలు

- చేపల కొలనుల తవ్వకంతో గ్రామీణ కూలీలకు ఉపాధి లభిస్తుంది.
- స్థానికంగా చేపల ఉత్పత్తి పెరిగి ఆహార భద్రతను మెరుగుపరుస్తుంది.
- మత్స్యకారులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుంది.
- వర్షపు నీటిని నిల్వ చేయటానికి సహాయపడుతుంది.
- భూగర్భజలాల స్థాయిని పెంచటం, వ్యవసాయానికి నీటి లభ్యతను మెరుగుపరచటానికి ఉపయోగపడుతుంది.
- చేపల విక్రయం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. మార్కెట్‌లో చేపల సరఫరా పెరిగి చిన్న వ్యాపారులకు మేలు కలుగుతుంది.
- చేపల కొలనుల నుంచి తీసిన మట్టిని భూసారం కోసం వ్యవసాయ భూముల్లో వాడవచ్చు.
- చేపల కొలనులు పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. పక్షులు, కీటకాలు, ఇతర జీవులకు ఆవాసాలుగా మారుతాయి.

పనులు కొనసాగుతున్నాయి



మామడ మండలంలో 19 చేపల కొలనులు తవ్వేందుకు ప్రతిపాదించాం. తొమ్మిదిచోట్ల పనులు కొనసాగుతున్నాయి. మిగతా చోట్ల కూడా కొలనుల ఏర్పాటుకు కొలతలు తీసుకుంటున్నాం.

– వర్థినేని సాయిచరణ్, టీఏ, మామడ

అవగాహన కల్పిస్తున్నాం



కొలనుల తవ్వకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 265 కొలనులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లాలోని కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

కొనుగోళ్లలో జాప్యంపై రైతుల రాస్తారోకో

- ఆర్డీవో హామీతో ఆందోళన విరమణ



నిర్మల్–భైంసా రహదారిపై నిలిచిన రాకపోకలు

కుంటాల: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తుండటంతో బుధవారం మండలంలోని అర్లి(కే) క్రాస్ రోడ్ వద్ద నిర్మల్–భైంసా 61 జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో చేశారు. రెండురోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా ధాన్యం తడుస్తోందని రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకున్నారు. రైతులు ఆర్డీవోకు సమస్య వివరించారు. రెండురోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని ఆర్డీవో హామీ ఇవ్వగా వారు శాంతించారు. గంటన్నరపాటు రాస్తారోకో చేయగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. భైంసాటౌన్ సీఐ గోపీనాథ్, ఏఎస్సైలు దేవన్న, శంకర్, లింబాద్రి పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్ కొ మ్రే వార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, మండల కన్వీనర్లు పడకంటి దత్తాత్రి, కోర్వ శ్యామ్, అశోక్ రాథోడ్, రాజుర అనిల్, రజనీకాంత్, రావుల పోశెట్టి, అసదే సజన్, వంశీ హుస్సేన్, ఎ త్రం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి అరుదైన గౌరవం



అరుణ బట్టువార్

ఇంద్రవెల్లి: బాల సాహిత్య వికాసం కోసం విశిష్ట సేవలందిస్తూ విద్యార్థులను సాహితీ వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్‌కు అరుదైన గౌరవం దక్కింది. తన సంపాదకత్వంలో విద్యార్థులచేత ఇప్పటి వరకు ఆరు పుస్తకాలు ముద్రింపజేశారు. ఆమె సేవలను గుర్తించి ఈ నెల 25న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా నిర్వహించే బాల సాహిత్య సమ్మేళనంలో సత్కరించనున్నారు.

ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధం

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని కొంగర్ల పోతన్నకు చెందిన పశువుల కొట్టంలో బుధవారం మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్తులు ఇచ్చోడ ఫైరింజన్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రొహిబిషన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మోటర్ల ద్వారా నీళ్లు పోయించారు. కొద్ది సేపటికి ఫైరింజన్ రావడంతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో పశుగ్రాసంతో పాటు, వ్యవసాయ పనిముట్లు, పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ



ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించడాన్ని నిరసిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించేందుకు వెళ్తుండగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు బూతులు తిడుతూ అడ్డుకున్నారని ఎంపీ వర్గీయులు తెలిపారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతామని చెప్పినా వినకుండా తమను అడ్డుకోవడం సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ఆసంపల్లి శ్రీకాంత్ అన్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతుండడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పున్నం, సృజన్, మాయ తిరుపతి, దాసరి సంపత్, శ్రీశైలం, అరుణ్, రాజేశ్, వెంకటేశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

- బాసరలో భక్తులకు తప్పని అవస్థలు



కలుషిత నీటిలో స్నానం చేస్తున్న భక్తులు



పుష్కర ఘాట్లపై నల్లమట్టి కుప్ప

బాసర: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతీ అమ్మవారు కొలువైన బాసర గోదావరిన ది పుష్కరఘాట్ల వద్ద పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదటి పుష్కర ఘాట్ నుంచి రెండో పుష్కరఘాట్ వరకు గోదావరి నీటి ప్రవాహం తగ్గడంతో పుష్కరఘాట్లపై నల్లమట్టి పెద్దపెద్ద కుప్పలుగా పే రుకుపోయింది. బాసర సరస్వతీ అమ్మవారి సన్ని ధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు దక్షిణాది రా ష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానం ఆచరించడం పుణ్యఫలంగా భావిస్తారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో గోదావరి ఘాట్ తీరమంతా అస్తవ్యస్తంగా మారింది. బురద, చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. బాసర ప్రధాన స్నానఘాట్ పైభాగంలో గంగమ్మ విగ్రహం, ఘాట్ కిందిభాగం మెట్ల వద్ద శివలింగం ఉంది. ఇక్కడ అనేక ఏళ్లుగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణ గాలి కొదిలేయడంతో శివలింగం కళ తప్పుతోంది. ఎంట్రన్స్‌లోనే పుష్కర ఘాట్లు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

కలుషిత నీటిలోనే స్నానాలు

మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకేశ్వర్‌లో పుట్టిన గోదారమ్మ బాసర వద్ద చదువులమపాదాలను తాకి తెలుగురాష్ట్రాల్లోకి అడుగిడుతుంది. ఎగువన భారీ వర్షాలు కురిసినపుడు వచ్చే వరదలతో ఘాట్లు పరిశుభ్రమవుతున్నాయే తప్ప అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. గత పుష్కరాల సమయంలో రూ.10 కోట్లు వెచ్చించి నిర్మించిన ఘాట్లు అధ్వానంగా మారిపోయాయి. ఫలితంగా పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. అంతేకాకుండా గోదావరినదిలో నీళ్లు కూడా కలుషితం అయ్యాయి. ఆలయ అధి కారులు భక్తుల సౌకర్యార్థం షవర్స్ ఏర్పాటు చేసినా కొంత మంది భక్తులు కలుషిత నీటిలోనే స్నా నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి పుష్కరఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పొచ్చరకు చెందిన కొలిపెల్లి వినయ్ (19) మావల మండలంలోని ఓ పెట్రోల్ పంపులో పని చేసేవారు. నెల రోజుల నుంచి పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం పొచ్చర శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి సమీపంలో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన చింతల నారాయణ (59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు యువకుల బైండోవర్



బైండోవర్ చేస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్నారన్న అనుమానంతో జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గుండంపెల్లి గ్రామానికి చెందిన సత్యపోలు యోగేష్, భైంసా పట్టణం పురాణ బజార్‌కు చెందిన షేక్ కైఫ్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి గంజాయి లభించలేదు. కానీ భవిష్యత్‌లో గంజాయి సేవించడం లేదా విక్రయిస్తారన్న అనుమానంతో వారిద్దరిని రూరల్ తహసీల్దార్ సంతోష్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టోల్ ట్యాక్స్ నిలిపివేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట సమీపంలోని వైజంక్షన్ వద్ద టోల్ ట్యాక్స్ నిలిపి వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో టోల్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ట్యాక్స్ పేరుతో దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. అటవీశాఖలో ఎక్కడా ఈ టాక్స్‌లు వసూలు చేయడం లేదన్నారు. కాళేశ్వరంలో పుష్కరాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ ట్యాక్స్ వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్‌గౌడ్, బుర్ర రాజశేఖర్‌గౌడ్, తుమ్మ శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పనులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి నూతనంగా ఏర్పాటు చేస్తున్న 67.5 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ పనులపై ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ బుధవారం ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు అధికారులను అడిగి పనుల అభివృద్ధిని తెలుసుకున్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జీఎం (ఈఅండ్‌ఎం) సోలార్ ఎనర్జీ జీఎస్ జానకీరామ్, ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్‌ఎం) వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, కేకే గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్ చేసే బోట్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ఫిల్టర్ బోట్‌తో పోలీసులు

జైనథ్: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యాపారి అభిలాష్‌రెడ్డితో పాటు సాంగ్వి గ్రామ వీడీసీ సభ్యులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు పెన్‌గంగ నది శివారులోని సాంగ్వి గ్రామం వద్ద ఎస్సై గౌతమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉల్లాస్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇసుకను ఫిల్టర్ చేసే బోట్‌ను సీజ్ చేసినట్లు పేర్కొ న్నారు. వారిపై ఇసుక దొంగతనం, పీడీపీపీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

జైనథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌కాలనీకి చెందిన సాహిల్ , ముషీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాడుతున్న 13 మంది..

నేరడిగొండ: పేకాడుతున్న 13 మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వెళ్లి మండల కేంద్రంలోని నీలిమ దాబా వెనకాల దాడులు నిర్వహించి పేకాడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో పాటు రూ.14,080 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సయ్యద్ జహీర్, గడ్డం రవి చందర్‌రెడ్డి, గూడూరు లవకుమార్, రాథోడ్ రవీందర్, అల్లూరి శివారెడ్డి, ఉప్పు పోశెట్టి, సోలంకి శ్రీనివాస్, నల్ల అడెల్లు, సోలంకి కరన్ సింగ్, గోతి గులాబ్ సింగ్, మాడ గంగాధర్, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, పవార్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టపాసులతో ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అర్ధరాత్రి టపాసులు పేల్చి జనాలను ఇబ్బందికి గురిచేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. వడ్డెర కాలనీకి చెందిన చోట ముష్రఫ్ తన జన్మదినం సందర్భంగా ఇంటి ముందు, బిల్డింగ్‌పై బాణసంచాలు పేల్చాడు. దీంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురయ్యారు. ఓ ఇంటిపై వేసిన ప్లాస్టిక్ కవర్‌కు నిప్పు అంటుకోవడంతో కొంత భాగం కాలిపోయింది. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఐదుగురిపై..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతం మీదుగా ఎలాంటి డాక్యుమెంట్‌లు లేకుండా వాహనంలో రెండు ఎడ్లను తరలిస్తున్న రాథోడ్ నితిన్, షేక్ సాకీర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. అలాగే వాహనాన్ని అడ్డుకుని బెదిరింపులకు గురి చేసిన చాందా (టి) గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై రాథోడ్ నితిన్, షేక్ సాకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పండ్ల వ్యాపారిపై దాడికి పాల్పడిన షన్ను, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో తోపుడు బండ్లపై షేక్ షహెబాజ్ పండ్లు విక్రయిస్తున్నాడు. ఎద్దు వచ్చి పండ్లను తింటుండగా అతను ఎద్దును కొట్టడంతో షన్నుకు తగిలింది. దీంతో ఆయన ద్విచక్ర వాహనం దెబ్బతింది. ఇందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద లేవని చెప్పడంతో తన మిత్రులను పిలిచి షహెబాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

విదేశీ పర్యటనకు ఏవో

- మంత్రులు, ఐఏఎస్‌లతో కలిసి వెళ్లనున్న విశ్వనాథ్
- బెల్లంపల్లికి చెందిన హార్టికల్చర్ అధికారి కూడా..



విశ్వనాథ్, ఏవో

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ శాఖ ద్వారా విదేశాల్లో అధ్యయనం కోసం ఆ శాఖ మంత్రి, ఐఏఎస్ అధికారులతో కూడిన బృందాన్ని పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృందంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం.రఘునందన్‌రావు, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కె.సురేంద్ర మోహన్, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తదితరులు ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న విశ్వనాథ్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఉద్యానవన అధికారి జె. అర్చన ఎంపికయ్యారు. వీరు నెదర్లాండ్, ఫ్రాన్స్‌లోని ప్యారీస్‌లలో పర్యటించనున్నారు. జూన్ 10 నుంచి 15 వరకు కొనసాగే పర్యటనలో ఆ దేశాల్లో వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగు స్థితిగతులు, దిగుబడులు సాధించేందుకు అనుసరిస్తున్న విధానాలు, నూతన వంగడాల సృష్టికి అవలంభిస్తున్న పద్ధతులు వంటి పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు. మూడు రోజుల చొప్పున ఆయా దేశాల్లో పర్యటిస్తారు. రాష్ట్ర బృందంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు ఉండటంతో ఇక్కడి రైతులకు సాగుపరంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదుపులోకి మరికొందరు నిందితులు!

- ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ

దహెగాం/పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో గత వారం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి పెద్ద పులి మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి, బుధవారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ, దహెగాం మండలంలోని గెర్రె, అమరగొండ గ్రామాలకు చెందిన పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎల్లూర్ అటవీ ప్రాంతంలో మృతి చెందిన పెద్దపులి అవశేషాలు దహెగాం మండలంలోని చినరాస్పెల్లికి చెందిన ఓ వ్యక్తి పెరట్లో పాతిపెట్టిన వాటిని బయటకు తీసిన విషయం తెలిసిందే. గ్రామ సమీపంలోని ప్లాంటేషన్ వద్ద పాతి పెట్టిన పులిచర్మం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం కాగజ్‌నగర్ వైల్డ్ లైఫ్ సీసీఎఫ్ ఎల్‌వి సింగ్, సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టోబ్రియల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పులి అవశేషాలు లభించిన ఎల్కరి శేఖర్ ఇంటికి వెళ్లి అతని భార్యను సైతం విచారించారు. పులిని ఖననం చేసిన ప్రదేశానికి వెళ్లి మరోసారి పరిశీలించారు. దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఒకరు, అమరగొండ, కర్జి గ్రామాలకు చెందిన మరో ఎనిమిది మందిని, పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ గ్రామాలకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులో ఉన్న వారి కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. పులి అవశేషాలు అమ్మకానికి బేరం పెట్టారా? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. కాగా ఎలాంటి సమాచారం లేకుండా విచారణ పేరుతో అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పులిని హతమార్చిన వారిని శిక్షించి అమాయకులను వదిలిపెట్టాలని వేడుకుంటున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్..

పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్ద పులిని హతమార్చిన ప్రాంతాన్ని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెరు బుధవారం పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టోబ్రివాల్, అటవీశాఖ అధికారులు ఉన్నారు.

‘ప్రభుత్వ ఉద్యోగులపై ఆరోపణలు సరికాదు’



ఫిర్యాదు చేస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులు

జైపూర్: జైపూర్ మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతిపై మాదిగ హక్కుల దండోరా నాయకులు చేసిన అసత్యపు, నిరాధారమైన ఆరోపణలు ఖండిస్తున్నామని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి సతీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై కక్షపూరితంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, సభ్యులు రవిచందర్, శ్రీనివాస్, ప్రశాంత్, సత్యనారాయణ, సురేశ్, ఉదేయ్‌కుమార్, స్వామి, అపర్ణదేవి, రజిత, విజయ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు కొంటున్నారా?

- జాగ్రత్తలు తప్పనిసరి



జొన్న విత్తనాలు

చెన్నూర్‌రూరల్: మరికొద్ది రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభమవుతోంది. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలులో రైతులు బిజీ అవుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అనుమతులు లేని కంపెనీలకు చెందిన విత్తనాలు, కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించి అన్ని వివరాలు పరిశీలించాకే కొనుగోలు చేయాలి. అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని చెన్నూర్ ఏవో యామిని సూచించారు. లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద ఎక్కడపడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. సరుకు, లాట్ నంబర్, తయారీ, తేదీ, రకం ఇలా అన్ని వివరాలు ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారు (షాపు) నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి. సంచులపై సీల్ తీసినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే తీసుకోకూడదు. వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి. క్రిమిసంహారక మందుల డబ్బాలపై కంపెనీ పేరు, తేదీ, కాలపరిమితి, గమనించి రసీదులు తీసుకోవాలి. ఏది ఎంత ధరతో కొన్నా.. డీలర్ లేదా దుకాణాదారు సంతకంతో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. మీరు తీసుకున్న విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నకిలీవని అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. అలాగే లాట్ నంబర్, తయారీ తేదీలను తప్పనిసరిగా చూసుకోవాలి. లేదంటే గతేడాది విత్తనాలు, మందులు, ఎరువులు అంటకడతారు. రైతులు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండి కాలం చెల్లిన మందులు, ఎరువులు, విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనకూడదు. అలాగే మందు డబ్బాలపై ఆకుపచ్చని లేబుల్ ఉందో లేదో గమనించాలి. ఆకుపచ్చ లేబుల్ ఉంటేనే ఆ మందును కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు విషయంలో రైతులు ఈ జాగ్రత్తలు తప్పకుండా పాటించి నాణ్యమైన దిగుబడులు పొందాలి.

నింగీ నేల ఏకమైనట్లు ఆవిష్కృతమైన అద్భుత చిత్రం



ఆకాశం మేఘావృతం కావడంతో ఇలా నేలను తాకుతుందేమో అనేట్లుగా కలిసి పోయిన చిత్రం బుధవారం సాయంత్రం సిరికొండ శివారులోని పంటచేనులో ఆవిష్కృతమైంది. పంటచేలలో వేసవి దుక్కులతో బిజీగా ఉన్న అన్నదాతలకు ఈ చిత్రం కనువిందు చేసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు మొదలై వర్షం కురిసింది.

– సిరికొండ